# నార్ల వెంకటేశ్వరరావు తో



(మంచం నిండా చుట్టూతా పరుచుకున్న సగం తెరిచీ మూసిన ఇంగ్లీషు తెలుగు పుస్తకాలు ఆ మధ్యలో గోల్డ్‌ఫ్లేక్ సిగరెట్టు పెట్టెల మధ్య సిగరెట్ ఆరారగా పీలుస్తూ నార్ల వెంకటేశ్వరరావు. పక్కన కాఫీ కప్పు సిగరెట్‌తో మరో సిగరెట్ వెలిగించబోతుండగా సిగరెట్ లాక్కుని నలిపి కిటికీలోంచి విసిరేస్తుంది మధురవాణి)

**మధురవాణి:** ఏవిటీ కాల్చడం? గది నిండా పొగ! ఎలా ఆలోచిస్తారు యిల్లాంటి గదిలో?

**నార్ల:** మాకు స్టోన్ దగ్గరకు వెళ్ళి నించోగానే ఐడియాలు వస్తాయి ప్రెస్సులో ఎంత గోలగా వుంటుందో నీకేం తెల్సు? యీ గది యింకా వెయ్యి రెట్లు బెటరు

**మధుర:** సిగరెట్ కాల్చకపోతే రాయలేరా'

**నార్ల:** ఏవిటో దవడలు పీక్కుపోతా... బుర్ర చిట్టెం గట్టినట్లు వుంటుంది. చెయ్యి ఆడదు సిగరెట్ లేకపోతే

**మధుర:** గిరీశంగారు చుట్ట వెలిగించమనే వారు

**నార్ల:** చుట్టకు మధ్యలో ఆరిపోయే గుణం వుంది, సిగరెట్ అలాక్కాదు నీకు చుట్ట వాసనే యిష్టమనుకుంటాను

**మధుర:** సానిదానికి యిష్టమేమిటి అయిష్టమేమిటి? సరసులకు ఏది ప్రియమో అది మాకు ప్రియం

**నార్ల:** కొంపదీసి నన్ను అందులో చేర్చలేదు గద-

**మధుర:** అంత అదృష్టమా? మీకు గురజాడ వారి మీద కోపం వచ్చిందని విన్నాను

**నార్ల:** అవును నేను యాంటీ నాచ్. అతగాడు రామస్వామి వెంకటస్వామి అనే వేశ్యలిళ్ళకు వెళ్ళి వాళ్ళ కోపతాపాలూ అలకలూ తీర్చి ఆనంద గజపతిరాజు గారికి వాళ్ళతో గొడవలు లేకుండా మధ్య వర్తిత్వం (అనకూడదు గాని, డాఫరీ) చేశాడట.

**మధుర:** రామ రామ - వారిద్దరికీ అప్పారావు గారంటే ఎంత గౌరవం? ఎంత భక్తి? వారిని తండ్రిగా చూసుకుని వారికంట పడకుండా జాగ్రత్తగా మసిలే వారు.

**నార్ల:** వాళ్ళిద్దరూ తాగేవారట తాగితే ఒకావిడ ఆనంద గజపతిని కూడా లెక్కచేసేది కాదట.

**మధుర:** అందుకే అటువంటి వేశ్యల బాలికలకు శిక్షణ నిచ్చేందుకు విజయనగరం రాజమహేంద్రాల్లో పాఠశాలల్ని నెలకొల్పి సంగీత సాహిత్యాల్లో శిక్షణ నిప్పించే వారని విన్నా

**వార్ల:** అందుకే తరవాత వీరేశలింగంగారు ఆడపిల్లలకు స్కూళ్ళు పెడితే అక్కడకు ఉన్నత కులస్థుల పిల్లల్ని పంపేవారు కాదు

**మధుర:** శ్రీ ఆనంద గజపతి మహారాజుల వారి సన్నిహిత మిత్రులుగా ఆస్థాన ఉద్యోగిగా పంతులుగారి మీద చాలా బాధ్యతలు వుండేవి. అత్త మీద కోపం దుత్త మీద చూపించినట్లు మీరు అప్పారావుగారిని నిందిస్తే ఏమి లాభం?

**వార్ల:** వీరేశలింగంగారు అప్పారావుగారున్న పొజిషన్లో వుంటే రిజైన్ చేసేవాడు కాని సానికొంపలట్టుకు తిరిగే వాడు కాదు

**మధుర:** మీరు అప్పారావు గారిని తప్పుగా అర్థం చేసుకున్నారు ఆయన దృష్టి ఎంతసేపూ నాటక రచయిత దృష్టి. వేశ్యల కొంపలు ఆ పరిసరాలు ఆయన కవి దృష్టితో చూడకపోతే ఆయన కన్యాశుల్కం రాసేవాడు కాదు. వీరేశలింగం పంతులు గారికీ గురజాడకూ వున్న ముఖ్యమైన తేడాను మీరు వక్రంగా గ్రహించారు

**వార్ల:** మహ చెప్పొచ్చావులే, వంకర అంటూ ఇబ్సన్ రాసిన 'డాల్స్ హవుస్' నువ్వు చదివావా?

**మధుర:** మీ నైతిక దృక్పథం జర్నలిజానికి పని కొస్తుందేమో గాని నాటకానికి కాదు నాటక రచయిత మీద అంత నైతిక బరువును ఎవరూ మోపరాదు ముని వెంకట సుబ్రహ్మణ్యం గారికి రాసిన ఉత్తరంలో గురజాడ దృష్టి స్పష్టం అవుతుండగా మీరు మా గురువు గారిని మాట తూలడం నే సహించను గాక సహించను

**వార్ల:** నీకు చాలా కోపం వచ్చిందే - కోపం తెప్పించడం నాకు వెన్నతో పెట్టిన విద్య మంచి ఎడిటర్ ప్రజలకు ఆగ్రహం వచ్చినా తను రాసిన దానికి కట్టుబడి వుంటాడు

**మధుర:** మీకు గురువుగారి మీద సద్భావం లేనప్పుడు ఆయన మీద అకాడమీకి మోనోగ్రాఫ్ ఎందుకు రాశారు? అది మీకు ఆత్మవంచన కాదా?

**వార్ల:** నామోనో గ్రాపును చెడగొట్టకలిగినంత తీవ్రమైనవి కావు నా అభ్యంతరాలు ఆయన జీవితం ఆయనదని జాలిపడ్డాను

**మధుర:** అప్పారావు గారు పురుడి పిట్టమాంసం కొద్దిగా యిష్టపడి తినేవారు. ఆయన రీవారాణి గారి సాన్నిధ్యంలో కోకో వైన్ పుచ్చుకునే వారు ఇవన్నీ మీకు అభ్యంతరాలా? అయినా మీ అభ్యంతరాలతో ఆయన్ని కొలవడం ఏం మర్యాద!

**వార్ల:** నైతిక ప్రమాణాలు లేకే మనజాతి యిలా వుంది.

**మధుర:** రాజులు జమీందారీల కాలం ఒకలా వుండేది విజయనగరాన్ని మాత్రమే సిటీ అనేవారు. రీవారాణి పుణ్యమాని విజయనగరంలో వీధి పంపులు వచ్చాయి. విశాఖపట్నంలో హార్బరు కట్టే జాగాని అప్పారావు గారు స్వయంగా వెళ్ళి చూసివచ్చారు. అలా డైరీలో రాసుకున్నారు.

**వార్ల:** విశాఖపట్నం అనే చిన్న సముద్రపు టొడ్డు గ్రామాన్ని పద్మనాభ యుద్ధంలో

ఓడిపోయి డచ్ వారికి అయిదు వేల రూపాయలకు మీ విజయనగరం వారు అమ్మేశారని చదివినట్లు జ్ఞాపకం.

**మధుర:** మీరెక్కడ చదివారు? అహా, మీ చదువు ఏ వూళ్లో నని ..

**నార్ల:** గుడివాడలో, బందర్లో తర్వాత కాకినాడలో

**మధుర:** మీరు మద్రాసు ఎలా వచ్చారు?

**నార్ల:** నాకు ఇంగ్లీషు జర్నలిజం అంటే యిష్టం. పత్రికలలో చేరుదామని మద్రాసు వచ్చా. యస్ జి ఆచార్య గారు నన్ను చేరదీశారు రోజూ నా లాల్చీ జేబులో ఓ పావలా వుండేది బస్సు ట్రాం కర్చులకు ఆయన నా జేబులో వేసే వారు నాకు తెలియకుండా నేనింత వాడి నయింది వారి చలవ వల్లనే-

**మధుర:** మీరు తరువాత వారిని గుర్తుంచుకుని అపకారం చేయకుండా వుంటే- ఉపకారికి అపకారము నెపమెన్నక సేయువాడు నేర్పరి సుమతీ అని కదా, మారిన నీతిసూత్రం - అదే పదివేలు (నవ్వు)

**నార్ల:** మనం ఒకరికి ఏదో ఉపకారం చేశాక అది వాడు జీవితాంతం గుర్తుంచుకుని మనకు కృతజ్ఞుడై వుండాలనుకోవడం పేరాశ ఇలా ఎందుకంటున్నానంటే, నేను నమ్మి పైకి తీసుకువచ్చిన వాళ్ళెవరూ చివరకు నావెంట లేరు

**మధుర:** దానికి మీకు తెలియని అనేక కారణాలుంటాయి కోపంలో అవి పైకి కనపడవు. పైగా మనది పోయ్యేకాలం వచ్చేకాలంతో వుంటారు వాళ్ళు

**నార్ల:** కోపం ఒక రసం కోపం నా మతం. కోపం నా వేదాంతం అంతేనా నువ్వనేది?

**మధుర:** అవునూ, మీరు ఆంధ్రప్రభలోంచి ఎందుకు బయటకు వచ్చారు?

**నార్ల:** వర్కర్సు, 'స్టాఫ్' అంతా సమ్మె చేస్తే వారితోపాటు నేనూ రిజైన్ చేసి బయటికి వచ్చేశా!

**మధుర:** మీరు వెళ్ళిపోయినంత మాత్రం చేత ఆ పత్రిక మూత పడుతుందనుకున్నారా? మీరు వెళ్ళి పోతానని బెదిరిస్తే మీ యజమాని వద్దన లేదట గదా! గత్యంతరం లేక బయటకు రావలసి వచ్చింది దాన్నే మీరు త్యాగంగా చిత్రించుకున్నారట: నిజమా?

**నార్ల:** పత్రికే ఎడిటర్, ఎడిటరే పత్రికగా నడిపాను గ్రాంథిక భాష, శిష్ట వ్యవహారికాన్ని కాదని ప్రజల తెలుగును ప్రవేశపెట్టాను. నా సంపాదకీయాల కోసమే ప్రభ చదివే వారనిపించాను ఇదేమీ సామాన్యం కాదు

**మధుర:** అందుకేగదా, మీతో ఈకబుర్లు! 'కండువా జర్నలిజం' మీతోనే ఆఖరను కుంటాను.

**నార్ల:** 'కండువా జర్నలిజం' ఏమిటి?

**మధుర:** గుమాస్తా జర్నలిజానికి పూర్వ రూపం, అంటే వ్యతిరేకం. మీ కాలంలో

యజమానిని వెనక్కు నెట్టి ఎడిటర్ ముందుకు వచ్చాడు. మీ తరువాత ఆఫీస్ మేనేజర్, మార్కెటింగ్ మేనేజర్ ఎడిటర్ని మూలకూచోబెట్టి న్యూస్‌పేపరు మీద పెత్తనం చలాయించసాగారు.

**నార్ల:** నీకింత భోగట్టా ఎలా తెలుసు?

**మధుర:** మీ తర్వాత, గోరాశాస్త్రి తర్వాత ఎడిటర్లెక్కడ వున్నారు? యిప్పుడంతా లిప్సిరగేషనే కదా! నా కెలా తెలుసునంటున్నారా? గిరీశంగారు ప్రెస్ క్లబ్‌కి వెళ్లొస్తుంటారు. వెంకటేశం ప్రెస్ క్లబ్ మెంబర్ కూడా. ఏదో యింగ్లీషు పేపరికి విలేకరిగా వుంటున్నాడు.

**నార్ల:** మాకంటే నువ్వే ఎక్కువ న్యూస్ కాన్షస్‌గా వున్నావు?

**మధుర:** ఆర్నెల్లు సావాసం చేస్తే వారు వీరువుతారు గోగినేని రంగనాయకులు అని వార్త ప్రచురించి మీరు యన్. జి. రంగాగారికి వ్యతిరేకి అయారు కొంతకాలం ఆంధ్రకేసరి ప్రకాశాన్ని తిడుతూ పంచ మహాపాతకాలు అని అయిదు సంపాదకీయాలు రాశారు. పొట్టి శ్రీరాములు గారి ఆమరణ నిరాహారదీక్షను కూడా మీరు సానుభూతితో చూడలేదనుకుంటా. బహుశా ప్రజలకు ఎదురు వెళ్ళడం కూడా మీజర్నలిజంలో ఒక యెత్తు కావచ్చు.

**నార్ల:** మన పేపర్లని వ్యతిరేకించి జనం తగులబెడుతూంటే నాకు గొప్ప సంతోషంగా వుండేది.

**మధుర:** ఒకటి, వాళ్ళు మూర్ఖులని మీ అభిప్రాయం. రెండు, వాళ్ళు వ్యాసును కాని పేపరును కాని తగులబెడుతూంటే మీ ' ఇగో' పెరుగుతుంది. నష్టపోయేది యాజమాన్యమే మీరు మ్యానేజిమెంట్లకి ఐరావతంలా మారారు

**నార్ల:** స్టోన్ దగ్గర నేను కింగ్‌లా వుండేవాణ్ని నా ఐడియాస్ అన్నీ అక్కడే వచ్చేవి

**మధుర:** మద్రాసులో మెయిల్ టైముకి ఎప్పుడూ అందిచ్చే వారు కాదట రోజా టాక్సీ పెట్టి కట్టలు సూళ్ళూరుపేట తీసికెళ్లి అందిచ్చేవారట గదా!

**నార్ల:** ఏదో ఏడ్చే వారు నేను అనుకున్నట్లు పేజీ వచ్చే దాకా స్టోన్ దగ్గర కుస్తీ పట్టేవాణ్ని.

**మధుర:** మాలతీచందూర్‌ని మీరేకదా డిస్కవర్ చేసింది?

**నార్ల:** అవును ప్రమదావనం నేను పెట్టిన శీర్షికే లతచేత ఊహాగానం రాయించింది నేనే పురాణాన్ని కూడా రైల్వేల నుండి రిజైన్ చేయించి జర్నలిజానికి తెచ్చింది నేనే తుర్లపాటి నా అడుగుజాడల్లో నడిచి ఎడిటోరియల్ రాస్తే అచ్చం నేను రాసినట్లుండేది అంతా నా వరవడే.

**మధుర:** నండూరి రామమోహనరావుగారు రాస్తే మీరు రాసిందేదో ఆయన రాసిందేదో గుర్తు పట్టడం అసాధ్యంగా వుండేదట ఆయన కంత పరకాయప్రవేశం వచ్చునా?

**నార్ల:** దేశికవితా మండలి గొర్రెపాటి వెంకటసుబ్బయ్య నా జీవిత చరిత్ర రాశాడు అందులో తను వుదహరించిన సంపాదకీయాలేవీ నావి కావు, ఏడిచి! అవన్నీ రామ్మోహనరావు రాసినవే.

**మధుర:** మీకతను అంత నమ్మిన మనిషి అనుకుంటా-

**నార్ల:** ఏడిచి!- వీళ్ళంతా నేను తెచ్చి తయారుచేసిన వాళ్ళే. ఆ ప్రసాద్‌తో కలిసి నన్ను 'బిట్రే' చేశారు.

**మధుర:** మీరు ఉద్యోగాన్నుంచి రిటైర్ అయ్యారుగావును?

**నార్ల:** కాదు. రిజైన్ చేశాను. నాకు ఇందిరా కాంగ్రేస్; బ్రహ్మానందరెడ్డి అంటే అసహ్యం. సంజయగాంధీ గుంటూరు వచ్చినప్పుడు రఘురామయ్య అతగాడి అడుగులకు మడుగు లొత్తాడు; మరో టుబాకో వాడెవడో వాడికి యింకేదో యేర్పాట్లు చేశాడు. వాడెవడసలు?

**మధుర:** నెహ్రూ మనవడు. ఇందిరాగాంధీ రెండో సుపుత్రుడు.

**నార్ల:** వాడిమీద ఎడిటోరియల్ రాయించాడు ప్రసాద్.

**మధుర:** ప్రసాద్‌గారు కాదు. ఆఫీస్ మేనేజర్ రాయించాడు గుంటూరు వాళ్లు ఆరోజు యాభైపుల్ పేజీలు మీ పత్రిక్కి అడ్వర్టయిజ్‌మెంట్లు యిచ్చారు

**నార్ల:** అందుకని కాంగ్రేస ( ఐ) పాలసీని వ్యతిరేకిస్తున్న ఎడిటర్‌ని నన్ను కాదని ఆ సంజయగాంధీ మీద ఎడిటోరియల్ రాయిస్తారా? నాతల తీసికెళ్ళి ఎక్కడ పెట్టుకోను?

**మధుర:** మీ యజమానికేదో వ్యాపార ప్రయోజనాలు లక్ష వుంటాయి. మీదొక దారీ ఆయన్ది మరొక దారీ అయితే నవ్వదా లోకం

**నార్ల:** అందుకే - రిజైన్ చేశా!

**మధుర:** యింత మాత్రానికే మీరు వీధిన పడాలా?

ప్రసాద్‌గారు మీకెంత చేశారు? ఆయన మిమ్మల్ని ఉద్యోగిగా చూడలేదే! ఎంతో మర్యాద యిచ్చారు.

**నార్ల:** ఈ పేపరుని అడ్డం పెట్టుకుని అతను తన ఇమేజిని ఎంత పెంచుకున్నాడో! ఈ పేపర్ని నేను కదా, సృష్టించి యిచ్చాను!

**మధుర:** ఆంధ్రజ్యోతి పెట్టిన కొతలో ప్రభ రీడర్ షిప్ అంతా మీకొస్తుందని మీకీర్తిని గురించి భ్రమపడ్డారు కాదా?

**నార్ల:** నార్లలేని పత్రిక ఉప్పులేని పప్పులా వుంటుంది అని అనుకోలేదు జనం. అదో పెద్ద ట్రాజిడీ.

**మధుర:** ఆ రోజుల్లో మీరు ఏర్పాటు చేసిన ప్రభ ఏజంట్లను అది మానేసి యిది పుచ్చుకో మంటే అంతా మిమ్మల్ని చూడగానే పారిపోయే వారట గదా! అసలు ఈ "ఆంధ్రజ్యోతి" అనే పేరెట్లా సంపాదించారు మీరు?

**నార్ల:** ఆంధ్రజ్యోతి అనే వార పత్రికను 1940లో బి. ఎన్. గుప్త అనేవారు ప్రారంభించారు. దానిని నేనే ఎడిట్ చేసేవాణ్ణి అదిపోయిన కొన్నాళ్లకి అంటే 1945లో గావును; చక్రపాణి గారు "ఆంధ్రజ్యోతి" అని మంత్లీ పెట్టేరు. ఆ పిమ్మట రాజమండ్రిలో దంటు కృష్ణమూర్తి

అనే అతన్ని '' ఆంధ్రజ్యోతి'' అని అప్పుడప్పుడు వచ్చి ఆగిపోయే దినపత్రిక వుండేది.

**మధుర:** అది మీరు కొనేసి వుంటారు. మద్రాసు నుండి తెలుగు పత్రికల్ని విజయవాడకు తర్లించిన ఘనత మీదేనా?

**నార్ల:** పూర్తిగా మాది కాదు. అంతకుముందే ప్రజాశక్తి దినపత్రిక కాట్రగడ్డ రాజగోపాల రావుగారి ఆధ్వర్యంలో కాబోలు విజయవాడ నుంచి వచ్చేది. అది కమ్యూనిస్ట్‌ల దినపత్రిక - యిది ఆంధ్రుల జాతీయ దినపత్రిక.

**మధుర:** మీరు అందులోంచి తప్పుకున్నాక ప్రభ చాలా మెరిగిందట, అవునా? చీపురు కట్టని సంపాదకుడుగా పెట్టి పత్రికను నడిపిస్తానని ఆ యజమాని అన్నాడట?

**నార్ల:** అలా పలికింది వాళ్ళ డబ్బు పత్రిక పెరగడానికి అనేక కారణాలుంటాయి. మత విషయాలకు ప్రాధాన్యం యివ్వక పోవడం, హేతువాదం, గాంధీయిజం, విజ్ఞానం, సైన్స్, పరిశోధన; యివి పత్రిక లక్ష్యాలుగా నడిపాను. ఆదర్శాలు కల ఎడిటర్‌కి ఆ ఆదర్శాలే సంకెళ్ళు.

**మధుర:** వాస్తవమ్ము నార్ల వారి మాట!

**నార్ల:** నువ్వు ఫాలో అయ్యావా నా పద్యాలు?

**మధుర:** అవ్వేం పద్యాలండీ? పూర్ ఇమిటేషన్స్ ఆఫ్ వేమన

**నార్ల:** నా కవిత్వం నీకు నచ్చలేదన్న మాట.

**మధుర:** మంచి ఎడిటర్‌గా తిరుగులేని పేరు తెచ్చుకున్నారు. మళ్ళీ కవిగా కూడా నిలబడాలని ఎందుకో ఆరాటం?

**నార్ల:** జర్నలిజం క్షణికం - అశాశ్వతం సాహిత్యంలో నిలబడితే గొప్ప

**మధుర :** మీ నాటకాల్లో 'పాంచరాత్రం' చాలా గొప్పది నిలుస్తుంది. ద్రౌపది అయిదు గురు భర్తలతో ఐదు రాత్రులు గడపడం అనేది గొప్ప ఐడియా.

**నార్ల:** మరి నా సీత జోస్యం, నరసింహావతారం మాటో-

**మధుర :** మీ కొత్త గడ్డలో నాటికలు బావుంటాయి సీత జోస్యంలో రాముడు చాలా వీక్, నరసింహావతారం కొంచెం కృతకంగా వుంది పురాణ కధల్ని అలానే చూడాలిగాని అవి నిజంగా జరిగిన వని భ్రమించి వాటికి జవాబు చెప్పాలనుకోవడం, ఇలా కాదు ఇలా జరిగిందని రాయడం అంత అవసరమా?

**నార్ల:** ఎవరిష్టం వారిది. నాకు బ్రామినిజం అంటే పడదు. బ్రాహ్మలంటే కాదు నా అసిస్టెంట్లందరూ వాళ్ళే-

**మధుర:** నార్ల చిరంజీవి మీకే మవుతాడు?

**నార్ల:** ఏమీ కాడు. అతనో కమ్యూనిస్ట్ కవి

**మధుర:** మీకు కమ్యూనిజం అంటే గిట్టదా?

**నార్ల:** గిట్టదు ఒకసారి ఓ కమ్యూనిస్ట్ ప్రబుద్ధుడు అన్నాడు '' ఈ భూస్వాముల భార్యల మెడలపై కాడి వేసి భూమిని దున్నిస్తాం మేం అధికారంలోకి వస్తే'' అని. అప్పుడు నాకు కోపం వచ్చి కార్టూన్లయుద్ధం ప్రారంభించాను. అటువైపు నుంచి విశాలాంధ్రలో రాంభట్ల వేశాడు జవాబుగా కార్టూన్లు.

**మధుర:** తెలుగు దినపత్రికలలో రాజకీయ వ్యంగ్య చిత్రాన్ని ప్రవేశపెట్టిన ఎడిటర్ మీరేనా?

**నార్ల:** కార్టూన్ యుద్ధాలెన్నో చేశాను. ఎడిటర్ని ఒక ముఖ్యమంత్రి, మంత్రి, రాజకీయ నాయకుడితో సమానంగా నిలబెట్టాను.

**మధుర:** భూస్వాముల భార్యల మెడలపై కాడివేసి పొలాలను దున్నిస్తామని ప్రగల్భాలు పలికిన కమ్యూనిస్ట్ లెవరు ఎడిటర్జీ?

**నార్ల:** మాకినేని బసవ పున్నయ్య. మార్క్సిస్ట్ పార్టీపోలిట్ బ్యూరోమెంబరు. ఆయన కమ్యూనిస్టుల్లో అరిస్టోక్రాట్ గోల్డ్ఫ్లేక్ సిగరెట్లు తప్ప తక్కువ రకం కాల్చేవాడు కాదు. చలాన్ని శ్రద్ధగా చదవమని కమ్యూనిస్ట్ కేడర్లకు రహస్య సర్క్యులర్ జారీ జేశాడు

**మధుర:** చలంగారి మీద అంత మోజెల్లా ఏర్పడిందో?

**నార్ల:** శ్రీశ్రీ మహాప్రస్థానానికి యోగ్యతా పత్రం యిచ్చాడు చలం. అది చూసి కమ్యూనిస్టులు చలం మావాడని చంక లెగరేశారు; మాచకమ్మను చూసి సన్యాసి చంకలు గుద్దుకున్నట్లు

**మధుర:** విశాలాంధ్ర వారితో గురజాడ మాన్యుస్క్రిప్టు తగువేమిటి? వివరంగా చెప్తారా?

**నార్ల:** గురజాడ వ్రాతప్రతులు డైరీలు అన్నీ విశాలాంధ్రవారి వద్ద వున్నాయి. అవి గురజాడ వెంకటరామదాసు నుంచి కొన్నారనుకుంటా ఆ రామదాసు సరైన సాహితీ వారసుడు కాదు. గురజాడ లైబ్రరీ అంతా సెకండ్ హ్యేండు పుస్తకాలుగా అమ్మేశాడు విజయనగరంలో. నేను సాహిత్య అకాడమీకి గురజాడ మీద మోనోగ్రాఫ్ రాస్తూ, ఆ గురజాడ మాన్యుస్క్రిప్ట్సును చూస్తే మంచిదని కాటగడ్డ రాజగోపాలరావుని అడిగాను ఒకసారి చూస్తానని. ఆయన ఆట్రంకు పెట్టెల్ని మా యింటికి పంపిచాడు భద్రంగా

**మధుర:** మీరూ మీ శిష్యుడు పురాణం; విశాలాంధ్ర వారికి వెన్నుపోటు పొడిచారట గదా-

**నార్ల:** నో-నో- అవసరాల సూర్యారావు వాటిని హాండిల్ చేశాడు. అతను బి.య్యే తెలుగు. యింగ్లీషు సరిగా రాదు అప్పారావు గారు అన్ని డైరీలు, ''మైవోన్'', ''హిజ్ హైనెస్'' అని అన్నీ యింగ్లీషులోనే రాశారు. అవి అల్లానే యింగ్లీషులో అచ్చువేసి వుండాల్సింది.

**మధుర:** విశాలాంధ్ర వారు ఏం చేశారుట?

**నార్ల:** ఆ కట్టలన్నీ సూర్యారావు మొహాన పారేశారు అతను బుడ్డి దీపం వెల్తుర్లో అప్పారావు గారు రాసిన వాటికి కొంత వదిలి కొంత చేర్చి అనువాదాలు చేశాడు. అవన్నీ 'డైరీలు', 'మాటా-మంతీ', 'కథానికలు', 'ముత్యాల సరాలు' అంటూ అచ్చయాయి. ఈ పనులన్నీ పూర్తవకుండానే సూర్యారావు పోయాడు.

**మధుర:** అప్పుడు మీరీ తేనెటీగల తుట్టెను కదిల్చారన్న మాట!

**నార్ల:** అలా మూలంతో తైపారు వేస్తూ పోతే చాలా దోషాలు కనిపించాయి ఒకరి రచనలను మూలానికి భిన్నంగా మార్చి అనువదించటాన్ని ఇంగ్లీషులో 'ఫోర్జరీ'లు అంటారు అప్పటికే సూర్యారావు అనువాదాలు ఆధారంగా ఇంగ్లీషులోకీ రష్యన్ లోకీ అప్పారావుగారి రచనలు వెళ్ళిపోయాయి ఆయనకు తీరని అపచారం జరిగిందని గ్రహించాను

**మధుర:** అవును విశాలాంధ్ర వారు సూర్యారావుకి అప్పగించారే కాని ఆ అనువాదాలు ఎలా వున్నాయన్నది వారు పట్టించుకోలేదు అలా మహాకవికి అపచారం జరిగిపోయింది

**నార్ల:** సూర్యారావు యిదంతా తెలిసి చేయలేదు. అతనికి సరిగా యింగ్లీషు రాదు, అంతే బ్రింజాల్స్ అంటే పచ్చిమిరపకాయలు అని రాశాడు Called on him, called అన్న ప్రయోగాలకి అర్థం తెలియక "His Highness Called him' - "Apparow called on His highness" అన్న దానికి తప్పుగా రాశాడు డైరీల్లో కొన్ని కొన్ని దాటవేశాడు

**మధుర:** కోతికి కొబ్బరికాయ దొరికినట్లు మీకు యింత అవకతవకల గ్రంథం దొరికింది ఐతే, మీరు విశాలాంధ్ర వాళ్ళతో సంప్రదించాల్సింది, ముందుగా

**నార్ల:** నాకు ఓపిక లేక యీ అవకతవకలు ఫోర్జరీల గురించి నా అసిస్టెంటు పురాణాన్ని దినపత్రికలో వ్యాసాలు రాయమన్నాను పైగా యీ డైరీలన్నీ సరిగ్గా మళ్ళీ వ్రాయించటం టైపు చేయించటం ఈ పనులు అవసరమయాయి ఒక ఆర్నెల్లకి పైగా వాటిమీద నా అజమాయిషీలో, పాటిబండ్ల సుందరరావు, గొల్లపూడి మారుతీరావు, కె వి రమణారెడ్డి, తుమ్మల వెంట్రామయ్యగార్లు పనిచేశారు అదీ, ఆ శోధన కార్యక్రమం

**మధుర:** విశాలాంధ్రవారు జవాబులు వ్రాయలేదా? వూరుకున్నారా

**నార్ల:** ఏటుకూరి బలరామమూర్తి గారు పురాణం హెల్పుతోనే 'జవాబు వ్యాసాలు' రాశారు వీళ్ళంతా స్నేహితులే, విరోధాలేం లేవు మాకు

**మధుర:** మీరు ఆంధ్రజ్యోతిలో 'ఫోర్జరీలు' అని కాంట్రవర్సీ లేవదీయడంవల్ల కమ్యూనిస్టులకి కళ్ళెర్రబడ్డాయన్నమాటా?

**నార్ల:** కన్నెర్రకాకేమీ? నేను వాళ్ళ వద్దనుంచి వ్రాత ప్రతులు తెచ్చి వాళ్ళకన్నే పొడిచానని!

**మధుర:** మీ గురజాడ మోనోగ్రాఫ్ సంగతేంటి, మరి?

**నార్ల:** పూర్తిచేశా పుస్తకం వచ్చింది

**మధుర:** కీర్తి మీకూ అపకీర్తి పురాణానికి వచ్చి వుంటుంది తడిక తోసిన వాడిదేగదా తప్పు అంతా.

* * *

**మధురవాణి నార్లవారి లైబ్రరీలో పుస్తకాలను చూస్తూ మాట్లాడుతూ వుంటుంది. నార్ల పుస్తకాలపై డస్ట్ దులుపుతూ మళ్ళీ అరల్లో సర్దుతూవుంటారు.**

**మధురవాణి:** గ్రంథచౌర్యం మీకు బాగా తెలుసంటారు నిజమేనా?

**నార్ల:** ఒక శబ్దాన్ని ప్రయోగించేముందు దాని అర్థం తెలుసుకుని మాట్లాడడం మంచిది.

**మధుర:** తెలుసుకోడానికి యిందులో ఏంవుంది? పుస్తకాలు దొంగలించడాన్ని గ్రంథచౌర్యం అంటారు కదా!

**నార్ల:** గ్రంథచౌర్యం అంటే · ఏదేనా ఒక ప్రసిద్ధకవి రచయిత రాసినదాన్ని మరొకరెవరైనా తనపేర ప్రకటించుకున్న తరవాత నాలాటి ఎడిటర్స్‌కి దొరికిపోతే గ్రంథచౌర్యం అంటారు అది తెలుసుకోముందు!

**మధుర:** పుస్తకాల దొంగల్ని గ్రంధచోరులు అనకూడదా?

**నార్ల:** నా లైబ్రరీ చూస్తూంటే నీకు మధ్యన వాళ్ళెందుకు గుర్తుకొచ్చారు?

**మధుర:** ఇవన్నీ మీరు కొన్నవేనా లేక సంగ్రహించి తెచ్చినవా?

**నార్ల:** నాదగ్గర రెండురూపాయలుంటే ఒకరూపాయి తిండికి కర్చుపెట్టి, ఒకరూపాయితో పుస్తకం కొన్నాను

**మధుర:** శ్రీశ్రీగారి దగ్గర రెండురూపాయలుంటే (తాను పస్తుండి) రెండు రూపాయలూ పెట్టి పుస్తకం కొని చదివాడటగా పాపం!

**నార్ల:** నేను కష్టపడి యింత లైబ్రరీ సేకరించాను

**మధుర:** తేనెటీగలు మధువును కూడబెట్టినట్లు అయితే ఇంతకీ యివన్నీ కొన్నవేనా అని?

**నార్ల:** నీకెందుకా అనుమానం?

**మధుర:** ఇన్ని పుస్తకాలు చదవాలంటే మానవ మాత్రుడివల్ల అయ్యే పనేనా? మీరు మానవులా, కంప్యూటరా?

**నార్ల:** నేను నీ కంటికెలా కనిపిస్తున్నాను?

**మధుర:** ఎడిటర్ వేషం వేసుకన్న శ్రీకృష్ణుడిలా వున్నారు

**నార్ల:** కృష్ణుడేవిటి? భగవద్గీత అంటేనే నాకు పడదు (నవ్వి) పుస్తకాలు సేకరించటం నా హాబీ

**మధుర:** అందుకే మిమ్మల్ని 'సంపాదకుడు' అన్నారు. రివ్యూకివచ్చిన కొత్త పుస్తకాల్ని లైబ్రరీలకిచ్చి లైబ్రరీల్లోని పాతపుస్తకాలను సంగ్రహించే వారటగదా, ఏమి చాక చక్యం?

**నార్ల:** ఎల్లాగైనా ఆ పుస్తకాలు లైబ్రరీల్లోంచి పోయేవే - నేను అవన్నీ జాగ్రత్తగా బైండుచేయించి కేటలాగింగ్ చేసి భద్రపరిచేవాడ్ని. సొంతలైబ్రరీ ప్రియురాలి కన్నా ఎక్కువ

**మధుర :** మీ సబ్ ఎడిటర్లని లైబ్రరీల్లో చేర్పించి వారి చేత మీకు కావలసిన పుస్తకాలను తెప్పించుకుని అవి పోయాయని చెప్పి వాటికి జుర్మానాలో ఖరీదో కట్టేసేవారటగదా! ఏంగడుసుదనం?

**వార్ల:** ఇవన్నీ ఎవరు నీతో చెప్పింది?

**మధుర:** శ్రీశ్రీ గారు; పేదలకవి.

**వార్ల:** అతగాడు నావద్ద సబ్ ఎడిటర్‌గా కొన్నాళ్ళు ఆంధ్రప్రభలో వెలిగించాడులే ఉద్యోగం నేను ఎడిటర్‌గా వుండగా నామీద వ్యంగ్యరచనలాటిది నాకు తెలియకుండా చేయించి నాపేపర్లో వేశాడు వెంటనే పీకిపారేశా అందుకే 'శ్రీ' అంటే విషం, 'శ్రీశ్రీ' అంటే విప్లవం అన్నా అతగాడి షష్టిపూర్తికి

**మధుర:** శ్రీశ్రీ అంటే మీకు పడదా? కమ్యూనిజమా, పేదలా; మీకు గిట్టనిది?

**నార్ల:** అతగాడి పద్యాలన్నీ దేనికో ఓదానికి కాపీలు 'ఏవితల్లీ నిరుడుకురిసిన హిమసమూహములు, "Where are the snows of yester years"కి కాపీ 'తాజ్‌మహలు నిర్మాణానికి రాళ్ళెత్తిన కూలీలెవ్వరు' యీ ఐడియాకూడా బెర్టోల్డ్ బ్రెక్ట్ అనే జర్మన్ కమ్యూనిస్ట్ కవి రచనలకు ప్రతిధ్వనులే బేసిక్‌గా అతడికి నిజాయితీ లేదు.

**మధుర:** రామ రామ! ఎడిటర్లింత నిర్దయగా వుండగలరని మిమ్మల్ని చూసే గ్రహించాను మీరు ఎవర్నీనమ్మరు ఎవర్నీ గుర్తించరు అందుకే మిమ్మల్ని పెసిమిస్టు అన్నాడు మహాకవి.

**నార్ల:** ఈ ప్రపంచమే నాలాంటి కొందరిని పెసిమిస్టులుగా మార్చేసింది అంతా వంచనే, అందరూ దొంగలే !

**మధుర:** అందుకే మీరు నవ్వగా చూసినవారు లేరంటారు. అవును మిమ్మల్ని నమ్ముకుని ఆంధ్రజ్యోతి ప్రారంభిస్తే అది కె ఎల్ ఎన్ ప్రసాదుగారిని మూడుచెరువుల నీళ్ళను త్రాగించి ముప్పుతిప్పలు పెట్టిందంటారు. అందుకే ఆయన, హైదరాబాద్ ఎడిషన్ పెడదామంటే, తెనాలి రామలింగడి పిల్లిలా భయపడి తప్పించుకున్నాడన్నారు అవునా?

**నార్ల:** ఆంధ్రజ్యోతి వల్లే అతగాడు ఆంధ్రదేశానికి పరిచయమయ్యాడు ఆంధ్రజ్యోతి వల్లే అతను రాజ్యసభ సభ్యుడయ్యాడు

**మధుర:** మీరు గొప్ప ఎడిటర్ అని అనుకోవడంలో తప్పులేదు నిస్సందేహంగా అంతవారే కాని - మీకు కోపంరాకుండా వుంటే ఒక్కమాట

**వార్ల:** అడుగు అమ్మీ! సందేహిస్తావు దేనికి?

**మధుర:** ఏమీలేదు. మీరు ప్రభలో మానేసినపుడు, (అదే, మానేసి యువతలకు వచ్చినపుడు,) ఆ సర్క్యులేషన్ అంతా మీ వెనకాల వస్తుందనుకున్నారు అవునా?

**వార్ల:** అదంతా నేను నా ప్రతిభతో సంపాదకీయాల్తో శీర్షికల్తో బిల్డప్ చేసినదే

**మధుర:** కావచ్చు. ఒక పత్రిక విజయానికి దాని వెనుక నున్న యంత్రాంగం యజమానుల డబ్బు కూడా కారణమని మీరు తెలుసుకోలేదు తెలుసుకున్నా గుర్తించ నిరాకరించారు. అదే తప్పు మీరు ఆంధ్రజ్యోతి విషయంలో కూడా చేశారు.

**వార్ల వెంకటేశ్వరరావు**

**నార్ల:** అంటే నీ ఉద్దేశం?

**మధుర:** పోటీమానికా తెల్లబియ్యమూ మీరు వెళ్ళాకే ఆ పత్రికలు అన్నీకూడా బ్రహ్మాండంగా పెంచుకున్నాయి సర్క్యులేషన్లు-

**నార్ల:** నేను న్యూస్‌కోసం ప్రకటనల్ని పీకించేసేవాడ్ని నేను స్టోన్ దగ్గరుంటే మేనేజర్లు గడగడలాడేవారు.

**మధుర:** మీ రెంతోసేపూ మీ ఇమేజికోసం చూసుకున్నారేగాని యజమాని బాగోగులు పట్టించుకోలేదు. ధనికులు మీకు అండగా వున్నా, వారికి మీరు అడ్డంగా తయారయ్యారు.

**నార్ల:** యజమానుల చేతుల్లో పత్రికలు ప్రజలపక్షం వహిస్తున్నట్లు నటిస్తూ వ్యాపార వర్గాల కొమ్ముకాస్తాయి అదే మనదురదృష్టం వారి డబ్బు వాడుకోవాలిగాని వారికోసం పనిచేయరాదు.

**మధుర:** ప్రసాద్ గారికి కూడా మీరు వయి చెలిఫెంటే అయ్యారు. మిమ్మల్ని ఆయన అన్నగారికంటె ఎక్కువగా గురువులా ఆరాధించారు అవునా?

**నార్ల:** నా స్వర్ణోత్సవానికి పోగుచేసిన విరాళాలకు సరైన లెక్కచెప్పలేదు అతగాడు

**మధుర:** తప్పు మీకోపం మీకు తెలీదు. మీది కక్షసాధింపు తత్వం అరవైవేలకు పైగా మిగిల్తే మీ సొమ్ము మీకిచ్చేసి రశీదు తీసేసుకున్నాడాయన కర్చులన్నీ కమిటీ ప్యాస్ చేసింది

**నార్ల:** మా గొడవలన్నీ నీకెల్లాతెలుసు?

**మధుర:** ఆయనే ఒక కాపీ మాకు కూడా, అంటే నాకూ గిరీశంగారికీ, యిచ్చారు తెలుసుకోండంటూ, మీ యాగీ భరించలేక

**నార్ల:** ప్రసాద్ నన్నుచాలా హర్ట్ చేశాడు

**మధుర:** మీరాయన్ను అంతకంటే మాటల్తో, ఉత్తరాల్తో కుళ్ళబొడిచారు మీరేం తక్కువా?

**నార్ల:** నువ్వు కూడా నియో రిచ్‌క్లాసు పక్షం వహించి మాట్లాడుతున్నావు. ప్రజల పక్షం కాదా నువ్వు?

**మధుర:** మీరు కాంగ్రెసుని వ్యతిరేకించారు - ఇందిరా కాంగ్రేస్ అంటే పడదు. కమ్యూనిస్టులను మునుపే వ్యతిరేకించారు చివరకు ఎన్ టి. ఆర్‌ని ఆశ్రయించాల్సిన గతి పట్టింది మీకు; కులతత్వం లేకపోయినా.

**నార్ల:** నేను ఆంధ్రజ్యోతిని ఎవరికీ గొడుగుపట్టే పత్రిక గాకుండా నాపత్రికగా తీర్చిదిద్దాను ఇందిరా కాంగ్రెసుని మట్టి కరిపించినందుకు నేను ఎన్.టి. ఆర్‌ని అభిమానించాను; వృత్తినేకాదు

**మధుర:** ఎన్.టి. ఆర్‌కు చెప్పి అకాడెమీలని రద్దు చేయించడం శాడిస్టిక్ చర్యకాదా?

అయినా మీరు ఎడిటరే కాని పండితులూ కవి కారుగదా బెజవాడ గోపాలరెడ్డి గారు అన్నట్లు.

**నార్ల:** బెజవాడ గోపాలరెడ్డి మీద కోపంతోనే అలా చెయ్యాల్సివచ్చింది

**మధుర:** కోతి పిల్లిచేత పొయ్యిలో పనసగింజలు తీయించినట్లు అయింది చివరకు

**నార్ల:** (నవ్వి) స్ట్రాట్ ఫర్డ్ ఆన్ ఆవన్, షేక్స్పియర్ జన్మస్థలంలో ఆయన విగ్రహం మధ్యన పెట్టి చుట్టూ షేక్స్పియర్ మహాకవి నాటకాలలో పాత్రల విగ్రహాలను నిలబెట్టి షేక్స్పియర్ పార్క్ కట్టారు అలా గురజాడనూ నిన్నూ మధ్యన నిలబెట్టి కన్యాశుల్కంలోని పాత్రలతో ఓ కన్యాశుల్కం పార్క్ ప్రతివూళ్ళోనూ నిర్మించాలి

**మధుర:** మీరు ఐడియాపురుషులే, కాస్త బుద్ధివంకరగాని, పోనీ సెనిలిటీ అనుకోండి చివరికి.

**నార్ల:** నీకు ఎందుకో నామీద సదభిప్రాయం లేనట్లుంది

**మధుర:** మీరు యాంటీ నాచ్ కదా! గురజాడ, శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారూ యాంటీనాచ్‌కారు. ''వేశ్యాకులం ఎందుకోసం పుట్టింది'' అని చక్కని వ్యాసం రాశారు, మహానుభావులు ఆయన్నేదో అన్నారట మీరు .(నవ్వు)

**నార్ల:** ఆయన పంచెలో షర్టుదోపి పైన కోటు వేసుకునేవారు 'తెలుగుకథకుల్లో కోటీశ్వరుడు మీ రొక్కరేనండీ' అన్నా

**మధుర:** దాని కాయనే వన్నారు?

**నార్ల:** 'మిగతా దరిద్రుల మాట నన్నడక్కండి' అన్నారు

**మధుర:** మీరున్నకాలం కూడా అల్లాటిది మీరు సాహిత్య కళా రాజకీయ తదితర రంగాలన్నిటా 'జయింట్స్' మధ్యవున్నారు ఇప్పుడంతా లిల్లిపుట్స్

**నార్ల:** ఈ మాట ఒప్పుకున్నావుగదా! నాపేచీ అంతా ఏమోరల్స్ లేని పరిపాలకులూ రాజకీయాలమీదే

**మధుర** : ప్రజాస్వామ్యం పోయి అగ్రీ ధనికస్వామ్యం వచ్చింది. నేటి దినపత్రికలూ రాజకీయ పార్టీలూ; ఆశయాలలో భేదాలవల్ల విడిపోవడంకాక, నిస్సిగ్గుగా కులాల వారీ వర్ధిల్లుతున్నాయి. వార్తల్ని అమ్మకపు దృష్టితో రాయిస్తున్నారు ప్రకటన కర్తల శాసనం పత్రికల మీద చెల్లుతోంది.

**నార్ల:** దీన్నే మార్కెట్ ఎక్స్‌పాన్షన్ అంటున్నారు నకిలీ ఎడిటర్సు

**మధుర:** జన్మలో పత్రికల మొహంచూడనివారు పత్రికలు పెట్టి అగ్రశ్రేణిలో వర్ధిల్లుతున్నారు కదా! దీన్ని మీరేమంటారు?

**వాళ్లు:** డబ్బు పెట్టి అన్నీ కొనగల్గుతున్నారంటాను ఏ విలువలూ లేని వినియోగదారుల సమాజం వచ్చింది సంస్కృతి, కళలు, సాహిత్యం వేటితో దానికి అనుబంధంలేదు మన మధ్య తరగతి కూడా అమెరికనైజ్డ్ అవుతోంది పూర్తిగా

**మధుర:** గిరీశంగారు అమెరికా వెళ్ళి పోతారట.

**వాళ్లు:** గిరీశంలాంటివారు అక్కడ లేరాయేమి?

**మధుర:** గిరీశంగారు ఎడిటరయితే -

**వాళ్లు:** గిరీశాలూ వెంకటేశాలూ ఎడిర్లయితే పూటకూళ్ళమ్మ పబ్లిషరవుతుంది.

**మధుర:** అంతకంటె ఏమీరానివాళ్ళు పత్రికా సామ్రాజ్యాన్ని ఏలుతుండగా గిరీశాని కేమి లోటువచ్చింది?

**వాళ్లు:** నువ్వు చెప్పింది అక్షరాలానిజం. కొత్తగా పత్రిక పెట్టిన ఒక శ్రీమంతుడు ''ఎడిటోరియల్స్ సంపాదకుడే ఎందుకు వ్రాయాలి?'' అన్నాడ్ట కాలేజీ మాస్టర్ల చేత సినిమా రైటర్స్ చేత ఎవరిచేతపడితే వారిచేత రాయిస్తాను ఎడిటోరియల్స్ అని అలాచేశాడ్ట!

**మధుర:** ధనికస్వామ్యం ప్రతిదాని Sanctity (అంటె పవిత్రతను) ధ్వంసం చేసి ఆనందిస్తుంది. అది దాని శాడిజం

**వాళ్లు:** బైబిల్లో సూక్తివినలేదా?

**మధుర:** ఏవిటిది?

**వాళ్లు:** సూది బెజ్జంలోంచి ఒంటె దూరిపోగలదుకాని భగవంతుని సామ్రాజ్యంలోనికి ధనవంతుడు ప్రవేశింపజాలడు.

**మధుర:** సెక్సు అమ్ముతుందంటే సెక్సు, షేర్లు అమ్ముతాయంటే షేర్లు, రాజకీయాల మ్ముతాయంటే రాజకీయాలు, సినిమా అమ్మితే సినిమా, ఏది అమ్ముడయితే అది ప్రచురించే పత్రికలు వచ్చి ప్రజాస్వామ్యాన్ని ధనస్వామ్యంచేశాయి.

**వాళ్లు:** అందుకే నాలోపాలు కోపాలు ఎలాటివయినా. నా తదనంతరం నా రెలవెన్స్ అధికమయింది, అది నువ్వు తెలుసుకో

**మధుర:** భోజన సందర్భంలో మీకు యిష్టమైన ఆధరువులు ఏవిటి?

**వాళ్లు:** కాల్చిన వంకాయపచ్చడి, పచ్చిపులుసు; ఇవంటే నాకు మహాయిష్టం. బంగాళాదుంప, పచ్చిబటానీ, టొమాటో, క్యారెట్ మొదలైనవి ఎక్కువ రుచిగలవైనా అవి తింటున్నపుడు తృప్తి తప్ప రియాక్షన్ రాదు. ఇవన్నీ ఎందుకిప్పుడు?

**మధుర:** మీ ఎడిటోరియల్స్ ఒకప్పుడు అల్లాగుండేవి మరి మీ గ్రీవియన్స్ ఏవిటి?

**నార్ల:** మహాకవినని, మహా రచయితనని ఇచ్చకానికైనా నన్ను మెచ్చుకున్నవారు లేరు. నా ప్రొఫెషన్‌లోని వాళ్ళే నన్ను కించపరచారు కావాలని

**మధుర:** మీకు బాగా నిద్రపడుతుందా? అదే; మీ ఆరోగ్యం బావుండేదా అని!

**నార్ల:** అదేమి పాపమో, నాకు త్వరగా నిద్రపట్టదు ఒకసారి పట్టినా ఒకపట్టాన మెలుకువరాదు అదీ ఓ ఆరోగ్యమేనంటాను

**మధుర:** ఎవరి బలహీనతల్ని వారు సమర్థించుకుంటారని గిరీశంగారు అనేవారు. మీరు పరధ్యాసను కీర్తించారు మీకు అది ఎక్కువా?

**నార్ల:** ఆలోచనాపరులకి ఏకాగ్రత ఒక Virtue ఒక విషయం మీద మనస్సు ఏకాగ్రంగావుంటే ఇంకోదాని మీద శ్రద్ధ తక్కువవుతుంది దాన్నే నువ్వు పరధ్యాస అంటున్నట్టుంది నిజానికి నాకు పరధ్యాస తరుచుగా సంభవిచేదే సిగరెట్ ముట్టించిన వెంటనే పరాకుగా పారవేసి కొత్తదాన్ని ముట్టించడం, కాల్చుతున్న సిగరెట్టుతో కట్టుగుడ్డలు కాల్చుకోవడం నాకు చాలాసార్లయింది తిండి తినిందీ తిననిదీ తరచు జ్ఞాపకం లేకపోవడం నాకు చాలాసార్లయింది కొన్న గంటలోపల గొడుగుపారవేయటం, రోజున్నరలోపల ఫౌన్‌టెన్ పెన్ జారవిడవడం నా రికార్డు పోస్టుబిళ్ళలను డబ్బాలోవేసి, ఉత్తరాన్ని వెనక్కి భద్రంగా తెచ్చిందిమాత్రం ఒక్కసారే

**మధుర:** పోయిన నిన్న గురించి, పుట్టని రేపుగురించి దిగులు పడక నేటి మాధుర్యాన్ని నేడే గ్రోలాలి మీరు కలుపుగోలుగా వుంటారా?

**నార్ల:** పలకరిస్తేనే తప్ప పలక్కపోవడం నాకు పరిపాటి ఇంగ్లీషు చదువులవల్ల, కొన్ని ఇంగ్లీషు సంప్రదాయాలు వంటబట్టడం యిందుకు కారణం కావచ్చు

**మధుర :** మీరు నాస్తికులూ భౌతికవాదులూ కావడంవలన మీరు నిర్వహించిన పత్రికలు నష్టపోయాయంటారు

**నార్ల:** అయినా నేను సంస్కృతికి దూరం కాలేదు నా భావాలు కొన్నిటిని మాత్రం నాకే పరిమితం చేసుకున్నాను.

**మధుర:** మీ పేర ఒక స్టడీసెంటర్‌ని నెలకొల్పాలని తెలుగుదేశం ముఖ్యమంత్రి ఒక రాయిపాతారు, హుస్సేన్‌సాగర్ బుద్ధపూర్ణిమ ఘాట్‌వద్ద అది ఏమయింది?

**నార్ల:** బుద్ధునికే గతిలేదు ఇక నా సంగతీ గతీ విచారించే వారెవరు?

**మధుర:** మీరు ఎడిటర్ గదా - పత్రిక విజయవాడలో వుండగా అక్కడ్నుంచి బిచాణా ఎత్తేసి బంజారాహిల్సులో 'లుంబిని'కి వచ్చేసారుట అవునా?

**నార్ల వెంకటేశ్వరరావు**

**నార్ల:** 'లుంబిని' నేను కట్టుకున్న యిల్లు. సొంత యింట్లో వుండాలని ఎవరికి అనిపించదట?

**మధుర:** అదే మీరుచేసిన పెద్దపొరపాటు. మీరు లేకుండా పత్రికవస్తుందని యాజమాన్యానికీ సిబ్బందికీ రుజావుచేశారు. ఇక ఎడిటర్ ఒకవయి టెలిఫోంటే కదా -

**నార్ల:** నా జీవితం చరమాంకం అంతా ఫ్రస్ట్రేషన్‌తో గడిచింది. బాల్యంలో గూడా చాలా బాధలు పడ్డాను. స్వంతంగా కష్టపడి నాస్థితిని నేనే సాధించుకున్నాను.

**మధుర** : ఉద్యోగ విరమణ గూడా సంతోషంగా జరగలేదుగా?

**నార్ల:** మేం చేసింది ఉద్యోగంకాదు. నడిపింది ఉద్యమం. మా సేవల్ని ఎవరూ రూపాయ అణాపైసల్లో, కొలవజాలరు.

**మధుర:** ఇప్పుడు జరుగుతున్నది అదే లెండి. అప్పుడు గనక అలా జరిగింది; - ఈ ఎలక్ట్రానిక్ యుగంలోని జర్నలిజాన్ని చూడకుండా వెళ్ళిపోయిన మీరు ధన్యులు. ★

*(మిసిమి - అక్టోబరు, నవంబరు, 1992)*